# అభిమానపు విలువలు

ఎక్కణ్ణించో నాన్నకు వుత్తర మొచ్చింది. అప్పణ్ణించీ అన్యమనస్కంగా వుంటున్నాడు నాన్న. ఆ వుత్తరం నాన్నలో దిగులును ప్రవేశపెట్టింది. అసలు నాన్నతత్వం మారిపోయి చాలా కాలమైంది. అక్కయ్య పెళ్ళికి ముందు దాన్ని ఎంత వుత్సాహంగా వుండేవాడు. ఎంత సరదాగా, చాలాకీగా వుండేవాడు. అక్కయ్య పెళ్ళయింది. ఆఖరు. అంతా మారిపోయాడు. అప్పణ్ణించీ నాన్న వుత్సాహంగా మాట్లాడి ఎరగడు. ఎప్పుడూ పకపకలాడుతుండే నాన్నముఖంలో దిగులు గూడుకట్టుకొంది. మాట్లాడ్డం మానేశాడు. ఇంట్లో ఎవరికీ జబ్బుగాలేదు. ఏ వ్యాజ్యెంలోనూ వోడిపోలేదు. అప్పులవాళ్లు జప్తు తీసుకురాలేదు. కుటుంబం భారంగాలేదు. ఇవన్నీ అయినా నాన్న దిగులుపడేవాడు గాదేమో! వీటన్నిటినీ మించిన వేదనే నాన్నను పీడిస్తూంది.

నాన్న చాలా పొరబాటుబడ్డాడు. అందుకే ఇట్లాకుమిలిపోతున్నాడు. అక్కయ్యకు మంచి సంబంధం తీసుకురావాలని ఎంత తాపత్రియపడ్డాడు! ఎంత ప్రయత్నించాడు! ఎంతకాలం! ఎన్ని వూళ్లు తిరిగాడు! ఎక్కడికి వెళ్ళినా ఏదోవొకటి లోటుగానే వుండేది. నాన్న లోటులేని సంబంధాన్ని తీసుకురావాలని చూస్తున్నాడు మరి—అమ్మకు భయం వేసింది. లోపల్లోపల విసుక్కుంది. అక్కయ్య చిన్నదీ చితకదీ గాదు. పధ్నాలుగో పదిహేనో సంవత్సరాలుంటాయి. పుటుక్కున పెద్దమనిషైతే ఎంత అభాసు! నలుగురూ ఏమంటారు? అమ్మకంటే ధైర్యం

గలవాడు నాన్న. అభాసవుతుందిగదా అని ఏ(తాష్టుడికో యిచ్చి అక్కయ్యను ముడిబెట్టడం నాన్నకు యిష్టంలేదు.

అక్కయ్యకి మొగుడుకోసం నాన్న ఆంధ్రదేశమంతా పైపైనోసారి చుట్టివచ్చాడు. ఆఖరికి నాన్న దృష్టికి ఆనిన కుర్రవాడు దొరికాడు. వాళ్ళకు ఆట్టే పొలంలేదు. ఇద్దరు అన్న దమ్ములు. పెద్దవాడు అదేదో వూళ్ళో నెలకు యాభైరూపా యలు తెచ్చుకొంటున్నాడు. చిన్నవాడికి ఎనిమిదేళ్ళుంటాయి. మూడో తరగతి గావును చదువుతున్నాడు. పెద్దపిల్లవాణ్ని చూపులకు రమ్మని వాళ్ళతో చెప్పొచ్చాడు నాన్న.

వారం తరవాత వాళ్ళొచ్చారు. అమ్మచూసింది. అక్కయ్య చూసింది. రామయ్య చూశాడు. రామయ్యకూ నాన్నకూ బొచ్చెడంత స్నేహం. రామయ్యకు చెప్పందే నాన్న ఏపనీ చేయడు. రామయ్య అంగీకరించకపోతే ఎంత మంచిదయినా నాన్న త్యజిస్తాడు. రామయ్య పెద్దపిల్లవాడికి అక్క నియ్యడానికి వొప్పుకొన్నాడు. రామయ్య వొప్పుకొంటే నాన్న వొప్పుకొన్నట్లే మరి—

"ఏమే! ఈ పిల్లవాణ్ని రామయ్యకూడా వొప్పు కొన్నాడు. నాకూ ఇష్టమేననుకో; మరి—నీ సంగతేమిటో చెప్పు" అన్నాడు నాన్న అమ్మతో వంటింటి తలుపుదగ్గర.

"ఇది మరీబాగుంది. నా ఇష్టమేమిటీ- మీకంటే నా కెక్కువ తెలుసా ఏమిటి?...అయినా దాన్నిగూడా అడిగి చూడండి. చేసుకొనే దానికీ, మీకూ ఇష్టమయినపుడు నాకు మాత్రం ఇష్టంగాకుండా ఎట్లా వుంటుందీ!" అన్నది అమ్మ. అమ్మలో స్వతంత్రభావం చచ్చిపోయి చాలాకాలమైంది.

అమ్మకు సొంత అభిరుచులంటూ లేనేలేవు. నాన్నకు ఇష్టము యినవన్నీ అమ్మకుగూడా ఇష్టమవుతాయి. నాన్నకు బాగుం డనివన్నీ అమ్మకుకూడా బాగుండవు.

"ఏమే-పిల్లవాణ్ని చూశావుగా?" అన్నది అమ్మ అక్కయ్యను.

ఇందాక అక్కయ్య పిల్లవాణ్ని కిటికీగుండా చూసింది. అందుకేగావును కిటికీకి ఎదురుగా ఆ పిల్లవాడికి మంచం వేసింది అమ్మ. ఎంత కాలాంతకురాలు!

అమ్మ అడిగిన ప్రశ్నకు అక్కయ్య సిగ్గుపడింది. తలవంచు కొంది. కాలితో నేలమీద గీతలు గీసింది. జడరిబ్బను మెలి బెట్టింది. పైట చెంగుదారాలు లాగింది.

"చెప్పమ్మా! అవతల వాళ్లు పోవాలని తొందరపడు తున్నారు. సిగ్గుపడితే ఎట్లా? ఇటువంటి వాటిలో సిగ్గు పనికి రాదు. అమీతుమీ తేల్చు. పిల్లవాడు చామన చాయగా వున్నాడు. నువ్వు చూచావుగా: ఎక్కడో యాభై రూపాయల నౌకరీట. బాగా చదువుకొన్నాడట. కవిత్వం గూడా చెబు తాట్ట" అన్నది అమ్మ అక్కయ్య జుట్టు సవిరిస్తూ.

"ఏమో నాకు తెలీదు. మీ ఇష్టం" అన్నది అక్కయ్య బుంగమూతి పెట్టి ఒచ్చేనవ్వును బలవంతాన ఆపుకొంది అక్కయ్య. అమ్మ ఏమన్నా అనుకొంటుం దేమోనని.

"మాకందరికి ఇష్టమైందే తల్లీ. ఇక నీఇష్టమే కావల సింది. దబ్బున చెప్పమ్మా! మా బంగారుకొండవు గదూ!! చెప్పమ్మా! ఏం? తాంబూలాలు పుచ్చుకొనమంటావా?" అన్నది అమ్మ అక్కయ్యను బుజ్జగిస్తూ.

పుచ్చుకోండి, వూహుకోండి — నాకు తెలీదు. మీ మాట యెప్పుడన్నా కాదన్నానా? అన్నది అక్కయ్య. అని అక్కడినించి తుర్రున దొడ్లోకి వెళ్ళింది, వేపచెట్టునీడకింద పడుకుంది—అక్కయ్య దొంగ. ఇష్టమైతే అయిందనరాదా? లేకపోతే లేదనరాదా? నలుపుడు పెట్టడమెందుకు? ఆ పిల్లవాణ్ని చేసుకొందామని అక్కయ్యకు మనసులోవుంది. పైకి చెప్పడానికి సిగ్గుపడింది పాపం! ఇష్టమే లేకపోతే కచ్చితంగా 'నాకక్కర్లేదు' అని తెగేసి చెప్పలేక పోయిందా? ఇదివరకు ఎన్నిసంబంధాలకు అట్లా చెప్పలేదు గనక?

పెళ్ళయిపోయింది. కార్యం ఇంకా కాలేదు. పెళ్ళికి ముందే అక్కయ్య పెద్దమనిషైంది. వాళ్లుచూచివెళ్ళిన వారానికే గావును. నాన్నా, అమ్మా ఈ సంగతిని భద్రంగా దాచిపెట్టారు. బైటబడితే పరువు పోతుందని భయపడ్డారు. బావ సంగతి నాన్నావాళ్ళకు సరిగ్గా తెలీదల్లేవుంది. బావ సంస్కరణవాది. ఇటువంటి వెర్రిమొర్రి ఆచారాలకు బావ అతీతుడు తరవాత బావకు ఈ సంగతి తెలిసింది. నాన్నా అమ్మల అజ్ఞానానికి నవ్వుకొన్నాడు. 'ముందుగా చెబితే మాత్రం' యేం? అనుకొన్నాడు గూడాను.

పెళ్ళయిన నాలుగు నెలలకు బావ వుద్యోగానికి రాజీనామా ఇచ్చాడు. ఏభై రూపాయలకూ సున్నా చుట్టబడింది. బావ కమ్యూనిస్టు. ఆ ఆఫీసులోవుండే అధికారికి కమ్యూనిస్టులంటే మంట. ఈ రెండుసంవత్సరాలూ అధికారిగారు తన మంటను తనలోనే వుంచుకొన్నాడు. ఇండియాకు స్వాతం

గ్రత్యం (?) వచ్చిన తరవాత, ఆయనగారి మంటకీ స్వాతంత్ర్యం వచ్చింది. అది ఒక్క పెట్టున బావమీద విరుచుకుపడింది. బావకు ఆత్మాభిమానం ఎక్కువ. నాశనం గావడానికయినా సిగ్గపడతాడుగాని, ఆత్మద్రోహం చేసుకోలేడు. వుద్యోగం ఖాళీఅయిన తరవాత ఇంటికి రొచ్చాడు. వూరికే తిని తిరుగు తున్నాట్ట. కాకపోతే ఏదో పుస్తకం ముందేసుకూర్చుంటాట్ట—

నాన్నా అమ్మలకు ఈ సంగతి తెలిసింది. వాళ్లు చాలా విచారించారు. ఏదో వుద్యోగం వెలగబెడుతున్నాడు గదా అని అక్కయ్యనిచ్చి పెళ్ళిచేశారు. చదువుకొన్నవాడు, ఎక్కడైనా గుమాస్తాగిరీ చేసి పెళ్ళాని కింత కూడుబెట్టకపోతాడా అని నాన్న అనుకొన్నాడు గాని, ఇట్లా నానా అడ్డమైన పార్టీల్లోనూ తిరిగి, బంగారమంటి వుద్యోగానికి తులసితీర్థం వదలి, యింట్లో గోళ్లుగిల్లుకుంటూ కూచుంటాడని కలలోగూడా అనుకోలేదు. మళ్ళీ వుద్యోగం దొరకాలంటే చాలా కష్టం. దొరక్క దొరికిన ఈ యాభైరాళ్ళనూ త్రోసిరాజని చేసే దేమిటి? పోనీ పొలమున్నా పదెకరాలులేదు. దానిమీద యినా బతకవచ్చనుకోడానికి. కట్టుకున్న పెళ్ళానికేం కూడు బెడతాడు. రేపు పిల్లా జల్లా బయలుదేరితే—సంపాదించడం చేతగాకపోయినా ఇటువంటి వాళ్ళకు యీ తెలివితేటలు జాస్తీ—వాళ్ళ గతేమిటి? ఇత్యాదిగా బావనిగురించి విచారించినవాడయినాడు నాన్న.

అమ్మకుకూడా బావంటే చేలికదనం ఏర్పడింది. నాన్నకు తోచిన సందేహాలన్నీ అమ్మకుగూడా తోచాయి.

అక్కయ్యను చూసినపుడల్లా అమ్మ కడుపుచెరువయి పోతుంది. పధ్నాలుగు సంవత్సరాలు అతి గారాబంగా పెంచిన బిడ్డను చూసి చూసి దాని గొంతుకోయడం జరిగింది.

అమ్మకూ నాన్నకూ బావమీాద అసహ్యాం కలిగింది. ఇదివరకు బావ వుద్యోగం చేస్తున్నప్పుడు నాన్న గర్వంగా పది మందికీ చెప్పేవాడు "మా అల్లుడు అక్కడ వుద్యోగం చేస్తున్నాడండీ! నెలకు యాభైరూపాయల జీతం యిస్తారు. ఇంకా పైకి పోయే సూచనలుగూడా వున్నాయి..." అనేవాడు నాన్న. అటువంటివాడు ఇపు డెవరన్నా బావను గురించి అడిగితే "ఏమో ఏంచేస్తున్నాడో! ఉత్తరమన్నా రాసిన పాపాన పోతేగా తెలియడానికి?" అంటాడు ముఖం మటమటలాడించుకొంటూ.

అమ్మా నాన్నా ప్రతిరాత్రి పొద్దుపోయేదాకా బావను గురించే మాట్లాడుకొంటారు. అక్కయ్యగూడా నిద్రపోతున్నట్లు నటిస్తూ ఆమాటలన్నీ వినేది. విని తనగతికి ఏడ్చేది. ఇరుగు పొరుగు ఆడపిల్లల్ని చూసినపుడల్లా అక్కయ్యకు తన భావి దరిద్రదశ కళ్ళలో మెదిలి కుంగిపోతూంటుంది పాపం.

"పొరపాటుపడ్డాను. పిల్లగొంతు కోశాను. డబ్బు సంపాదించడం చాతగాదు వీడికి. నాతల్లికి, నా బంగారు కొండకు......ఏమిటి గతి?"

బావకు ఎవరో స్నేహితురాలు వుత్తరం రాసింది. బావ ఇక్కడ్నే వున్నాడనుకొని నాన్న కేరాఫ్‌కి ఆవిడ రాసింది. బావ ఇక్కడలేడని ఆవిడకు తెలీదల్లేవుంది. ఆ వుత్తరం నాన్న కందింది. కుంగిపోయ్యాడు నాన్న. బావను

చెడామడా నోటికొచ్చినట్లు తిట్టాడు. ఎదట నేవుంటే కొట్టే వాడేమో తెలీదు.

'ఏమిటండీ? ఏమి టా వుత్తరం?' అన్నది అమ్మ. కాకర కాయలు వేపుతూ నాన్న కేకలు వినివచ్చింది.

'ఏడికిత్తోడు ప్రియురాలు వుత్తరాలు. ఛీ ఛీ. బంగా రమంటి పిల్లను యీ తుంటరి కిచ్చి దానిగొంతు నులిమాను' అన్నాడు నాన్న చిందులు తొక్కుతూ.

ఎవర్ని గురించండీ ఈ ఎగురుడు?' అన్నది అమ్మ. అమ్మకు ఈ గొడవంతా అర్థంగాలేదు.

'ఇంకెవరు? నీ అల్లుడే! ఈయన కొక నేస్తం. ఆవిడ వుత్తరం రాసింది' అన్నాడు నాన్న వుత్తరాన్ని నేల కేసి కొట్టి.

'మరి కళలన్నీ వుండొద్దూ? తక్కువయితే ఎట్లా?'

'మంచి వాడని! బుద్ధిమంతుడని, వుద్యోగం వెలగ బెడుతున్నాడని పిల్లనిచ్చాను.'

'మంచివాడంటే, సామెత చెప్పినట్లు చేశాడు.' అన్నది అమ్మ మెటికలు విరిచి.

"ఈ అప్రయోజకుడికి ఆత్మాభిమానాలు..." మాటలు రాక వూపుకొన్నాడు నాన్న.

"ఈయనగారికి రెండు పూటలా కాఫీలు కావాలి. మళ్ళీ కాస్త యెడమైతే 'లబలబ' లాడిపోతాడు. మీరెన్నన్నా చెప్పండి. వాడికి మనమే యింత పడవెయ్యాలి, పిల్లనిచ్చిన నేరానికి... అసలు వాడికి అమ్మాయినివ్వడం సుతరామూ నాకిష్టంలేదు చెప్పొద్దూ. మీరంతా అంగీకరించిన తరవాత

కాదంటే బాగుండదని తలూపాను'' అన్నది అమ్మ. అని కాకరకాయ వేపుడు చూడ్డానికి వెళ్లింది.

బావకి రెండు పూటలా కాఫీతాగే అలవాటుంది. కాస్త యెడమైతే 'లబ లబ' లాడే మాటమాత్రం నిజం. కానీ అమ్మకి అది పెద్ద నేరంగా కనిపించడం ఆశ్చర్యంగా వుంది. బావంటే అమ్మా నాన్నలకు ఎంత అభిమానముందో ఈ రోజున తెలిసిపోయింది.

''ఇంటికి రానీ చెప్పుతీసుకొని తంతాను. ఎవడడ్డం వస్తాడో చూస్తా.'' అన్నాడు నాన్న.

'మెత్తగా తన్నాలి, ఇటువంటి బుద్ధితక్కువ వుత్తరాలు రాయించకుండా' అన్నది అమ్మ వంటింట్లోనించి.

నాన్నా, అమ్మా కలిసి బావను తన్నడానికి తీర్మానించుకొన్నారు. అక్కయ్య మాత్రం ఇహ జన్మలో బావ ముఖం చూడగూడదని తీర్మానించుకొంది. ఇన్నిటికీ బావ చేసిన తప్పేమిటో అర్థంగా లేదు.

బావ వస్తాడని ఎవరూ అనుకోలేదు. హఠాత్తుగా మధ్యాహ్నం పూట వచ్చాడు బావ. పెళ్లయిన తరువాత బావ రావడం ఇదే మొదలు. వొస్తూ వొస్తూ రెండు డజన్లు చక్కెరకేళీలు తెచ్చాడు. అక్కయ్యకు సిల్కుజాకెట్టు కుట్టించుకొచ్చాడు. చిన్నవాడికి అరపౌనుపిప్పరమెంట్లు తెచ్చాడు.

''ఎక్కణ్నించిరా అబ్బాయ్!'' అన్నాడు నాన్న.

"అంతా కులాసాగా వున్నారుగా తమ్ముడూ!" అన్నది అమ్మ. బావనెందుకో తమ్ముడూ అని పిలుస్తుంది అమ్మ.

"ఇంటి దగ్గర్నుంచేనండి! ఆఁ ..అంతా కులాసాయే అక్కాయ్!" అన్నాడు బావ కాళ్ళు కడుక్కొని.

అక్కయ్య కిటికీగుండా బావను చూస్తోంది. ముఖం చూడగూడదని శపథంచేసి నిండా నాలుగు రోజులయినా కాలేదు. మరి వాదిపోయినట్లుగా అట్లా చూస్తుందేం? దేబిరి గొట్టు. అంత ఆరాటం వుండబట్టలేనిది తెలివితక్కువగా ప్రతిజ్ఞలు చేసుకోవడం ఎందుకో?

"ఏమేవ్...పిల్లా! మీ ఆయన వొచ్చాడు. ఈ సంచీ అదీ ఇంట్లోపెట్టు. అలమార్లో కాఫీడబ్బా వుంది. ఒక్క చంచాడువేసి తొరగా కాఫీ కానియ్...ఎండబడి వొచ్చాడు బిడ్డ...స్నానం చెయ్యరాదూ నాయనా! కాస్త బడలిక తగ్గుతుంది" అన్నది అమ్మ. గోధుమలు బాగుచేసే ప్రయత్నంలో మునిగింది. బావకు గోధుమపూరీలంటే ఎంతో యిష్టం. రాత్రికి పూరీలు చెయ్యాలని అమ్మ యత్నం.

ఆ పట్టు పట్టు బావ వారంరోజు లున్నాడు. ఈ వారం రోజుల్లోనూ నా న్నెప్పుడూ బావను చెప్పుతీసుకు తన్న లేదు. అమ్మ బావ చూస్తుండగా, మెటికలు విరవనూలేదు. బావకు యిష్టమయినవన్నీ చేసిపెట్టింది. ఒకరోజు పెరుగుపచ్చడి చేసింది. ఒకరోజు పెసరట్లుచేసింది. మఱొకరోజు పంచదార లడ్డూలు చేసింది. బావకు తీపి తినే అలవాటు తక్కువ. లడ్డూలు తినలేదు. అందుకని చప్పున యింత శనగపిండి కలిపి

బూ దీ చూసింది అమ్మ. కూరల్లో బెల్లం వేయడం అమ్మకు అలవాటు. బావకు అది సరిపడదు. ఆ వారంరోజులూ బెల్లం లేని కూరలే తిన్నారు ఇంటిల్లిపాదీ.

అక్కయ్య చేసిన శపథం తొలిరోజునే వీగిపోయింది. రెండో రోజున మాత్రం అట్లా అట్లా తిరిగింది, అందీ అందకుండా. మూడోనాటినుండీ అక్కయ్య పూర్తిగా మారిపోయింది. మధ్యాహ్నం కావడం భయం. అక్కయ్య బావ గదిలో దూరేది. మూడుగంటలదాకా వాకట్ గుసగుసలు. అమ్మా నాన్నలుగూడా వాళ్ళగదివేపు ఎవర్నీ పోనిచ్చేవాళ్లు గాదు.

ఒకరోజు పొద్దున్నే బావ ప్రయాణమైనాడు. 'ఇప్పుడెక్కడపోవడం? ఇంక నాలుగు రోజులేగా వినాయకచవితి వుంది? పండుగదాకా వుండు' అన్నాడు నాన్న.

'ఇవ్వాళ నిన్ను పోనివ్వడమే? పండగ వాకిట్లోపెట్టుకుని నిన్ను పోనిస్తే లోకు లేమంటారో తెలుసా?' అంది అమ్మ.

అక్కయ్య బావ సంచి దాచేసింది. బావ పోవాలని గట్టి పట్టుపట్టాడు. నాన్న మరొకసారి వుండమన్నట్టయితే బావ ఖచ్చితంగా వుండేవాడు. పండుగకోసం గాకపోయినా అక్కయ్య కోసమైనా వుండేవాడు. నాన్న ఈ ఎత్తు కనిపెట్టాడల్లే వుంది మళ్లీ వుండమని అననేలేదు.

బావ పోతుంటే అక్కయ్య వెనకాలే వెళ్ళి 'మళ్ళీ ఎప్పుడొస్తారూ!' అంది ఎవరూ వినకుండా.

ఆగి 'ఎప్పుడు రమ్మంటావ్?' అన్నాడు బావ, అక్కయ్యతల నిమురుతూ.

'నేను రమ్మన్నప్పుడు వొస్తారా?' అంది అక్కయ్య.

'ఆ'

'నేను చెప్పినట్లు వింటారా?'

'శుభ్రంగా.'

'అయితే ఈ ప్రయాణం ఆపండి-రేపు, ఎల్లుండేగా లేంది. ఆవ లెల్లుండి పండగే నాయె.'

'మీ నాన్న వుండమనందే ఎట్లా?'

'నేనంటున్నాగా, వుండండి' అన్నది అక్కయ్య బావ గుండీలు తిప్పుతూ, బుంగ మూతిపెట్టి.

'ఉహూం-' అంటూ బావ వొంగాడు. బావకు అక్కయ్యంటే, అందులో బుంగమూతి అంటే ఎంతో యిష్టం. బుజ్జగించి వెళ్ళిపోయాడు. చిన్నవాడు గోడచాటునుండి చూచి అమ్మతో చెప్పాడు. అమ్మ పకపక నవ్వుకొంది తనలోతాను.

'విన్నావా?' అన్నాడు నాన్న యింట్లోకి వస్తూనే.

'ఏమిటి?' అన్నది అమ్మ.

'మన అల్లుడుగారు చేసిన ఘనకార్యం.'

'ఏంచేశాడేం?'

'హాలాలికోట్లో ఐదురూపాయల సిగరెట్లు వాడాడు. రామయ్యదగ్గర పదిరూపాయలు అప్పుతీసుకొన్నాడు.'

'ఏంరోగమొచ్చిందీ? మనమిస్తూనే వున్నాంగా. ఇంతలోకే కాసూటంపట్టలేకపోయాడ్యా డెట్లా? అంతగా అవసరమయిన మనిషి డబ్బుపారేసి కొనుక్కోకపోయాడా? అప్పులు చేసిపోతే ఏశిబాబెవడున్నాడు తీర్చడానికి?'

'సిగరెట్లకు డబ్బుంటే వారంరోజులు మనింట్లో ఎందుకుంటాడోయ్? అది లేకనే ఈ వారం రోజులూ, ఇక్కడ జరుపుకొందామని వచ్చింది' అన్నాడు నాన్న చేతివేళ్ళను సాగగా మడిచి నోటిమీద తాటించుకొంటూ.

'ఇటువంటివాడు పెళ్లాని కేం కూడుబెడతాడు?'

'కూడుగాదు, కుంపటి.'

'బలవంతాన దానిగొంతుకోక్కోశాం' అన్నది అమ్మ ముక్కుతుడుచుకొని.

'ఈ వారంరోజులకీ యిరవైరూపాయలయినై. ఈ ప్రొద్దుట రాకుండావున్నట్లయితే యిరవై రూపాయలూ మిగిలేవి.'

'ఇరవై ఏమిటి? పాలవాళ్ళకు రెండున్నర యివ్వొద్దూ మరి?'

'అవు నవును. ఈయనకు రెండుపూటలా కాఫీ తగలబెట్టాంగా—అయితే దగ్గరదగ్గర నలభై రూపాయలన్నమాట.'

అమ్మా నాన్నా కలిసి బావను తిట్టారు. అక్కయ్య

భావిజీవితాన్ని తలచుకొని ముక్కులు తుడుచుకొన్నారు. కళ్లువొత్తుకున్నారు. అక్కయ్య తన గతికి ఏడ్చింది. బావ వూరివేపు చేతులుచాపి మెటికలు విరిచింది.

'ఏమిటిది?. అర్థం కాకుండావుంది. బావంటే మొదట్లో అందరూ అసహ్యించుకొన్నారు. అందరూ తిట్టారు. అందరూ తిమ్మారు. చెప్పు తీసుకొని తన్నాలని గూడా తీర్మానం జరిగింది. మరి బావ వారం రోజు లున్నాడు. ఇష్టమొచ్చినట్లు తిట్టవచ్చునే! ఒకటి గాదు; నాలుగు చెప్పులతో నజ్జునజ్జుగా తన్నవచ్చునే ఎందుకు చెయ్యలేదు? బావను చూస్తే భయపడవలసిన అవసరంగూడా లేదు. సన్నగా, పలచగా వుంటాడు. బావిలో కడవగూడా రాదు బావకి...అంతమర్యాద, అంత ప్రేమ బావముందు వొలకబొయ్యడం ఎందుకు? బావంటే ఎంతో అసహ్యపడిన అమ్మ 'పండగదాకా వుండ' మని బలవంతంచెయ్యడం ఎందుకు? బావ వూరివేపు మెటికలు విరిచిన అక్కయ్య 'ఎప్పుడువొస్తారూ?' అని నంగనాచిలా నటించకపోతేనేం? బావకు ఈ మర్యాదలన్నీ చేయకపోయినా తను కష్టపడడు. అయినా ఇవన్నీ కావాలని బావ అడగనూ లేదు. తన మర్యాదకోసం మల్లగుల్లాలుపడడం బావకు యిష్టంలేదు. బావ తత్వం అటువంటిది. నాన్న, అమ్మ, అక్కయ్యల ఒంటరి మనుషులుగారు. వాళ్లల్లో రెండు జీవాలు ఉన్నాయి. రెండు బ్రతుకులున్నాయి. పైకి కనిపించే బ్రతుకొకటి. లోపల యింకొకటి. రెండింటికీ ఎంత తేడా?